జనరంజక పాలన.. నాలుగేళ్ల సంబరం

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వేడుకలు
- పలు చోట్ల సేవా కార్యక్రమాలు



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న అక్కరమాని విజయనిర్మల, తదితరులు

ఆరిలోవ: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. పలు చోట్ల కేక్‌లు కట్ చేశారు. చినగదిలి ప్రాంతం దీన్‌దయాల్‌పురంలో ప్రభుత్వ బాలుర గృహంలో మంగళవారం సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య వ్యవస్థాపకుడు ఎస్.నారాయణ స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కేక్ కట్ చేశారు. అనంతరం బాలలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు అంటించిన ప్యాడ్‌లు అందజేశారు. క్రమశిక్షణతో మెలుగుతామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం సీఎం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి మంచి ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకుంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గృహం డిప్యూటీ సూపరింటెండెంట్ పి.రమణ, అరకు ఏఎంసీ డైరెక్టర్ కె.రామదాస్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

12వ వార్డులో..

జీవీఎంసీ 12వ వార్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేశారు. నాలుగేళ్ల పాలన ప్రజారంజకంగా జరుగుతోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, అర్జున్, సూర్యారావు, శ్రీను పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

ఎంవీపీ కాలనీ: సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఎంవీపీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ జగనన్న నాలుగేళ్ల సుపరిపాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని ప్రజాదరణ కార్యక్రమాలు ముఖ్యమంత్రి చేపట్టాలని ఆకాంక్షించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఆయనకు అండగా ఉంటారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, పలువురు కార్పొరేటర్లు, వార్డుల అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



బాలురకు ప్యాడ్‌లు అందజేసి ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, తదితరులు

మొరాయించిన సర్వర్లు

జగదాంబ: స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సర్వర్లు పనిచేయకపోవడంతో రెండు రోజులుగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సెంట్రల్ సర్వర్లు పనిచేయకపోవడమే ఇబ్బందులకు కారణమని తెలుస్తోంది. కనీసం నెలాఖరున అయినా సర్వర్లు పనిచేస్తే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేస్తాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు త్వరితగతిన స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం తగదు



ఎండాడలో చెరువును పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ

కొమ్మాది: నగరంలో పారిశుద్యం నిర్వహణపై నిర్లక్ష్యం వహించకుండా ప్రధాన రహదారులతో పాటు వీధి రహదారులను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. మంగళవారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఎండాడ నుంచి రుషికొండ జంక్షన్ వరకు పారిశుద్య పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుషికొండ నుంచి ఎండాడ వరకు పారిశుద్యం పూర్తి స్థాయిలో నిర్వహించడం లేదని, ప్రధాన రహదారుల వద్ద పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఎండాడలో ఉన్న ప్రజా మరుగుదొడ్లు పరిశీలించి నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. ఎండాడ చెరువు చుట్టూ ప్రహరీ నిర్మించాలని, లైట్లు పునరుద్ధరించాలని, చెరువుకు ఆనుకుని వున్న ఆక్రమణలు తొలగించాలని స్థానిక వాకర్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఏయూ వర్గాల హర్షం

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనపై ఆంధ్ర విశ్వవిద్యాలయం అధ్యాపక, ఉద్యోగ, పరిశోధక వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఏయూలోని వైఎస్సార్ విగ్రహం ఎదుట కేక్ కట్ చేయడంతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య షారోన్ రాజు మాట్లాడుతూ నవరత్నాల ద్వారా నాలుగేళ్ల పాలనలో పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా ప్రజా సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. దేశంలో ఏ నాయకుడు, ఏ పార్టీ చేయని విధంగా 98 శాతం హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా సీఎం జగన్ నిలిచారని కొనియాడారు. రాష్ట్రంలో విద్యా విధానాన్ని కొత్త పుంతలు తొక్కించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు అనేక అద్భుతమైన మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. పాఠశాల స్థాయిలోనే ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి వెనుకబడిన వర్గాల విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేశారని చెప్పారు. ఆచార్య ప్రేమానందం మాట్లాడుతూ నాలుగేళ్ల సీఎం జగన్ పాలన.. దివంగత వైఎస్సార్ ప్రజాకర్షక పాలనకు అద్దం పట్టిందన్నారు. రాష్ట్రంలో నాడు-నేడు ద్వారా పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేసిన తీరు సీఎం జగన్‌కు విద్యాభివృద్ధిపై భవిష్యత్ విజన్‌కు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ అధ్యాపక, ఉద్యోగ, విద్యార్థి వర్గాల ప్రతినిధులు లక్ష్మణబాబు, త్రినాథరెడ్డి, ఖాదర్ బాబా, రాంబాబు, లక్ష్మణ్‌రెడ్డి, రమణారెడ్డి, బొట్ట రామచందర్, మోహన్‌బాబు, కల్యాణ్, స్వరూప్, జానకీరామ్, సాయికృష్ణ, రాజుకుమార్, ఆనంద్, అంబేడ్కర్, రమణ, శాంతారావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఆచార్య, ఉద్యోగ, పరిశోధక వర్గాల ప్రతినిధులు

క్లుప్తంగా

బాలల దినోత్సవం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ: అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను మంగళవారం ఉదయం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. జూన్ 1వ తేదీన ఈ కళాశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నరవ ప్రకాశరావు, జగదీశ్వరరావు, సత్యశాంతి, లత, రామారావు, బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విజ్ఞాన శిబిరం

ఎంవీపీ కాలనీ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. నిపుణులైన అధ్యాపకులు వేదిక్ మ్యాథ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే గణితంలో పట్టు సాధించాలని సూచించారు. తద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. కథలు చదివించడం, కథలు చెప్పడంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎంవీపీ కాలనీ: ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలోని ఎంవీపీ సెక్టార్-1, గోశిసన్స్, క్యాన్సర్ ఆస్పత్రి, సెక్టార్-2 చుట్టు పక్కల ప్రాంతంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. సెక్టార్-1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ సరీ్వసుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు సంస్థ ఈఈ జి.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

1న సహస్ర తులసిపూజ

కనక మహాలక్ష్మి దేవస్థానంలో జూన్ 1న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుము రూ.1500 చెల్లించాలని ఈవో పేర్కొన్నారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా



వెస్ట్ ఏసీపీ కార్యాలయంలో కేసులపై ఆరా తీస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

గోపాలపట్నం: రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని నగరపోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ సూచించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌తో పాటు సమీపంలోని ఏసీపీ కార్యాలయాలను మంగళవారం సీపీ ఆకస్మికంగా సందర్శించారు. లా అండ్ ఆర్డర్ వెస్ట్ సబ్ డివిజన్ కార్యాలయంలో కేసుల నమోదు, దర్యాప్తు విధానాలను పరిశీలించారు. మహిళలపై దాడులు జరగకుండా దిశ యాప్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్ల పనితీరుపై ఆరా తీశారు. ట్రాఫిక్ స్టేషన్, వెస్ట్ సబ్ డివిజన్ క్రైం ఏసీపీ కార్యాలయంలోనూ తనిఖీలు చేశారు. వెస్ట్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, క్రైం ఏసీపీ సునీల్, సీఐ బీఎండీ ప్రసాద్, ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు పాల్గొన్నారు.

తుది దశకు ఆంజనేయ స్వామి విగ్రహం పనులు



హనుమంతవాక వద్ద తీర్చిదిద్దుతున్న ఆంజనేయస్వామి విగ్రహం

ఆరిలోవ: హనుమంతవాక వద్ద తలపెట్టిన ఆంజనేయస్వామి విగ్రహం పనులు తుది దశకు చేరుకున్నాయి. ఓ కొండపై, దానిపై ఆంజనేయుడు సంజీవిని పర్వతం చేతితో పట్టుకున్నట్టు ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ గ్రామం పేరుకు తగినట్టు హనుమంతుడి విగ్రహం కనిపించే విధంగా జీవీఎంసీ అధికారులు సిద్ధం చేస్తున్నారు. బీఆర్‌టీఎస్ కూడలిని ఆనుకుని ఖాళీ స్థలంలో 43 అడుగుల ఎత్తులో ఈ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. దీనిలో 10 అడుగులు ఎత్తులో సహజ సిద్ధమైన కొండను తలపించేలా తీర్చిదిద్దుతున్నారు. దానిపై 33 అడుగులు ఎత్తులో విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. రెండు రోజులుగా ఆంజనేయుని చేతిలో సంజీవిని పర్వతం అమర్చుతున్నారు. మరో 15 నుంచి 20 రోజుల్లో ఈ విగ్రహం పనులు పూర్తవుతాయని జీవీఎంసీ పార్కుల విభాగం ఏఈ సురేష్ తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరంలో డైట్ పంపిణీ



డైట్ పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ రాము

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు నెహ్రూనగర్ కాలనీ పార్కులో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు మంగళవారం ఉచితంగా డైట్ పంపిణీ చేశారు. మూడో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ రాము, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ముఖ్యఅతిథులుగా పాల్గొని గుడ్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం సమయంలో వ్యాయామం చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు.

వేసవి శిక్షణ శిబిరాల సందర్శన

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను మంగళవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, అడిషనల్ కమిషనర్ సన్యాసిరావుతో కలసి సందర్శించారు. తోటగరువులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలాజీనగర్‌లో జీవీఎంసీ కల్యాణ మండపం, డ్రైవర్స్‌కాలనీలో సెయింట్ ఆన్స్ స్కూల్ తదితర చోట్ల జరుగుతున్న శిబిరాలను ఆమె పరిశీలించారు. ఆయాచోట్ల శిక్షణ ఇస్తున్న కరాటే, బాక్సింగ్, త్రోబాల్, వాలీబాల్ తదితర క్రీడలను పరిశీలించారు. వారికి పంపిణీ చేస్తున్న ఆహారం సక్రమంగా అందజేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆయా చోట్ల శిబిరాలలో పిల్లలకు ఆమె పాలు, గుడ్లు, అరటి పళ్లు, బిస్కెట్లతో కూడిన ఆహారం బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శిక్షణ శ్రద్ధతో నేర్చుకొని క్రీడల్లో రాణించాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో శిబిరాల కోచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



తోటగరువు పాఠశాలలో విద్యార్థులకు ఆహార పొట్లాలు అందిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మర్రివేముల శ్రీనివాస్, తదితరులు

ఎంవీపీ కాలనీ: నిరుద్యోగుల ఉపాధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమితి అధ్యక్షుడు మర్రివేముల శ్రీనివాస్ ఎంవీపీ కాలనీ సెక్టార్-12లోని సంస్థ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తక్షణం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో సైతం వేల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉందని చెప్పారు. ఆగస్టు 11, 12 తేదీల్లో నిరుద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో విశాఖ వేదికగా మహాసభలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర కార్యదర్శి సూర్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్, కె.శ్రీనివాస్, రమణ, గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం కిట్ల పంపిణీ



టీబీ పేషెంట్‌కు పోషకాహారం కిట్ అందిస్తున్న వైద్యురాలు అనిత, సిబ్బంది

ఆరిలోవ: స్థానిక జీవీఎంసీ ఆస్పత్రిలో టీబీ విభాగంలో రోగులకు మంగళవారం పోషకాహారం కిట్లను అందజేశారు. ప్రధాన మంత్రి టీబీముక్త్ భారత్ అభియాన్(పీఎం టీబీఎంబీఏ)లో భాగంగా క్షయ బాధితులకు కందిపప్పు, రాగి పిండి, గోదుమ పిండి, వేరుశనగ పలుకులు, నూనె, గుడ్లు, ప్రోటీన్ పౌడర్ తదితర వాటితో కూడిన కిట్లను టీబీ విభాగం సిబ్బంది అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరిలోవ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ అనిత, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ కిరణ్ లలిత, టీబీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

వికసించిన మే పుష్పం

ఆరిలోవ: పెదగదిలి దరి కొండవాలులో ఈశ్వరినగర్‌లో ఓ ఇంటి ఆవరణలో మే పుష్పం వికసించింది. కె.కృష్ణ పాత్రో తన ఇంటి పెరట్లో ఐదేళ్ల క్రితం మే పుష్పం విత్తనం నాటారు. అది మొలకెత్తి చిన్న మొక్కగా పెరిగి కొద్ది రోజుల అనంతరం ఎండిపోయేది. ఇలా చాలా సార్లు జరిగింది. ఇటీవల కొత్తగా మొలకెత్తిన ఆ మొక్కకు సోమవారం మాత్రం పిందెలు వచ్చాయి. ఆ పిందెలు మంగళవారం ఉదయానికి వికసించి పుష్పాలయ్యాయి. దీంతో ఆ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. మే పుష్పాన్ని స్థానికులు ఆసక్తి చూశారు.



పెదగదిలి ఈశ్వరినగర్‌లో వికసించిన మే పుష్పం

యువకుడి ఆత్మహత్య



అవినాష్ మృతదేహం

ఆరిలోవ: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఆరిలోవ ఎస్‌ఐ అప్పారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుర్గాబజార్ దరి శివశంకర్‌నగర్‌కు చెందిన కె.అవినాష్(19) ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. ఏ పనీ చేయకుండా ఖాళీగా ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అవినాష్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. కుమారుడి మృతితో అవినాష్ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. తండ్రి ప్రకాష్ మార్బుల్ పలకలు అమర్చే పని చేస్తుంటాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అవినాష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, దానిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కార్మికుల ఐక్యతే సీఐటీయూ లక్ష్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

అల్లిపురం: కార్మికులను ఐక్య పరచడమే సీఐటీయూ ప్రధాన లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో యూనియన్ ఉపాధ్యక్షుడు కె.ఎం.కుమార్ మంగళం అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ 1970 నుంచి ఈనాటి వరకు కార్మికుల కోసం సిటు పోరాడుతూనే ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 830 రోజులుగా చేస్తున్న పోరాటమే ఇందుకు సాక్ష్యమన్నారు. విశాఖ నగరంలో సుమారు 3 లక్షల మంది కార్మికులు ఉండగా సీఐటీయూలో కేవలం 40 వేల మంది మాత్రమే సభ్యులుగా ఉన్నారన్నారు. కనీసం లక్ష మంది సభ్యులుంటే మనం శాసించే స్థాయికి చేరుతామన్నారు. కార్మికులందరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, మణి, ఆర్.కె.ఎస్.వి.కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా అప్పన్న కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు అధిష్టింపజేశారు. విష్వక్సేన, పుణ్యాహవచనం, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం జరిపారు.

పారిశుధ్య కార్మికుల శ్రేయస్సే ముఖ్యం



పారిశుధ్య కార్మికులకు టోపీలు అందజేస్తున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి

కొమ్మాది: పారిశుధ్య కార్మికుల శ్రేయస్సే ముఖ్యమని మేయర్ హరి వెంకట కుమారి అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ వార్డు కార్యాలయం వద్ద పారిశుద్య కార్మికులకు మంగళవారం టోపీలు పంపిణీ చేశారు. ఎండలకు పారిశుద్య కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు గుర్తించి కమిషనర్ సాయి కాంత్ వర్మ ఆలోచనల మేరకు ఇప్పటి వరకు 8,200 టోపీలు సమకూర్చి అందించామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ వి.సన్యాసిరావు, జెడ్సీ కనక మహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహన్ పాల్గొన్నారు.

అంబికాబాగ్ రామాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం



ప్రత్యేక అలంకరణలో విశ్వేశ్వర స్వామి

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6.30 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్టాపనతో అంకురార్పణ చేశారు. ధ్వజారోహణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు వెంకటరత్నం, అనురాధ, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు టి. తిరుపతిరావు పాల్గొన్నారు.

నేడు స్వామి కల్యాణోత్సవం..

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం విశేష హోమాల అనంతరం ఉదయం 10.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిపించనున్నారు.

సత్యదేవుని ఆలయంలో..

ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో వార్షిక దివ్య కల్యాణోత్సవాలు మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ద నాగ జగదీష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 7 గంటలకు స్వామి దివ్య తిరు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు.

పోర్టు వెంకన్న ఆలయంలో ..


పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 6.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం జరిపించనున్నారు.

నేడు విశ్వేశ్వరస్వామి కల్యాణం

సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 31 నుంచి వార్షిక కల్యాణ మహోత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. బుధవారం రాత్రి 8.05 గంటలకు విశ్వేశ్వరస్వామికి, బాల త్రిపుర సుందరికి పరిణయం జరిపించనున్నారు.

కొత్త రూ.50 వెండి నాణెం

- సొంతం చేసుకున్న అల్లిపురం యువకుడు



రూ.50 వెండి నాణెం, సేకరణకర్త దాసు ఆదినారాయణమూర్తి

అల్లిపురం: దేశంలో పులుల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటీవల భారత ప్రభుత్వం, పులి ముఖంతో అతి తక్కువ ముద్రణతో 50 రూపాయల వెండి నాణెం విడుదల చేసింది. ఆ వెండి నాణాన్ని అల్లిపురం, వాసవి క్లబ్ సభ్యుడు దాసు ఆదినారాయణమూర్తి (అనిల్) సొంతం చేసుకున్నాడు. అనిల్‌కు దేశ విదేశీ నాణాలు, నోట్ల సేకరణపై ఆసక్తితో దీనిని సేకరించినట్లు తెలిపారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.75 నాణెం కూడా రానుందని ఆయన తెలిపారు. నాణాల సేకరణ అభిరుచిగా మార్చుకున్న అనిల్‌ను వాసవి క్లబ్ అల్లిపురం అధ్యక్షుడు డీవీఎస్ఎన్ రాజు, కార్యదర్శి బీవీఎల్ కుమార్, కోశాధికారి పీవీఎస్ఆర్ గుప్తా తదితరులు అభినందించారు.